క్లుప్తంగా

వాటర్ ట్యాంక్‌లో శుభ్రత చర్యలు



మండవల్లి : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని పలు గ్రామాల్లో స్పెషల్ శానిటేషన్ కింద సోమవారం వాటర్ ట్యాంక్‌లు శుభ్రం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు కలుషితమై మురుగునీరు వచ్చే అవకాశం ఉందని ఈఓపీఆర్డీ బి.ఆనందబాబు తెలిపారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందజేయటానికి మండవల్లి-1, భైరవపట్నం, అప్పాపురం, అయ్యవారిరుద్రవరం, మొఖాసాకలవపూడి, నందిగామలంక, చింతలపూడి, పుట్లచెరువు, లోకుమూడి, సింగనపూడి గ్రామాల్లో వాటర్ ట్యాంక్‌లు శుభ్రం చేసినట్లు ఈఓపీఆర్డీ చెప్పారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



మొవ్వ: విజయవాడ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది ఆదిశేషు విఠల్‌బాబును కిడ్నాప్ చేసి అతి దారుణంగా హత్య చేసిన ఘటనకు నిరసనగా సోమవారం ది మొవ్వ బార్ అసోసియేషన్ న్యాయవాదులు విధులు బహిష్కరించారు. మొవ్వ కోర్టు వద్ద నిరసనను తెలిపారు. న్యాయవాదిని హత్యచేసినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకువచ్చి, న్యాయవాదులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ పులి శ్రీనివాసరావు, కే శ్రీ వెంకటేశ్వరరావు, కొల్లూరి రామాంజనేయులు, పి.రాధకృష్ణ, పోతుల శివ శ్రీనివాస్, టి.ప్రసాద్, ఎం.సరస్వతి పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు



గుడివాడ టౌన్: ఆర్‌కే యూత్ కన్వీనర్ రామకృష్ణ (ఆర్కే) ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక బేతవోలు శాంతి వృద్ధుల ఆశ్రమంలో సోమవారం వృద్ధులకు వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ కోలా వెంకటేశ్వరరావు సారథ్యంలో వృద్ధులకు వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్కే మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఒంటరిగా జీవనం సాగిస్తున్న వీరికి అనేక ఆరోగ్య సమస్యలు ఉంటాయన్నారు. వాటిని ముందుగానే పరీక్షించి ఉపశమనానికి కావలసిన చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ మీరాషరీఫ్, నూనె అయ్యప్ప, దివిలి సురేష్, గంటా అంజి, చరణ్‌తేజ్, పి.శ్రీను పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థి ఆర్థిక సాయం

కైకలూరు: స్థానిక ఓరియంటల్ స్కూల్ పూర్వ విద్యార్థి మానికొండ సుబ్బరాజు ఎన్ఆర్ఐగా స్థిరపడ్డాడు. తను చదువుకున్న స్కూల్‌లో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన ముగ్గురు బాలికలకు ఇంటర్మీడియెట్ పూర్తి చేయడానికి ఒకొక్కరికీ ఏడాదికి రూ.15,000 చొప్పున చెల్లించేందుకు నిర్ణయించుకుని చెక్‌లను అందించారు. దాత సాయాన్ని పలువురు అభినందించారు. కార్యక్రమంలో మానికొండ గంగాధరరావు, దాత కుటుంబ సభ్యులు, హెచ్‌ఎం ఏ.శ్రీకృష్ణ, ఉపాధ్యాయుడు బొర్రా శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

పట్టాదారు పాసుపుస్తకం ఇవ్వాలని వినతి

గుడివాడరూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ కె.ఆంజ నేయులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని మోటూరు గ్రామం నుంచి పట్టాదార్ పాస్ పుస్తకానికి ఆధార్ అనుసంధానం చేయాలని అర్జీ వచ్చిందన్నారు. గుడివాడ పట్టణంలోని పెద ఎరుకపాడుకు చెందిన ఓ రైతు పట్టాదార్ పాస్‌పుస్తకం ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేశారన్నారు. స్పందనలో వచ్చిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగబాబు, రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

మండవల్లి : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి అర్జీలు ఏమీ రాలేదని తహసీల్దార్ కె. రాజ్‌కుమార్ తెలిపారు. ఎంపీడీఓ టీకే వెంకటరమణ, ఎఫ్‌డీఓ శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ శేఖర్, పీహెచ్‌సీ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు టీకాలతో వ్యాధులకు చెక్

- మూగజీవాలపై సీజనల్ వ్యాధుల ప్రభావం
- పశువులకు పొంచి ఉన్న ముప్పు
- జాగ్రత్తలు పాటించకుంటే ప్రమాదమే
- ముందస్తు టీకాలు తప్పనిసరి


పశువులకు టీకా వేస్తున్న పశు వైద్యులు (ఫైల్)

గుడివాడరూరల్: సీజనల్ వ్యాధులు మనుషులకే కాదు మూగ జీవాలకు సైతం సంక్రమిస్తాయి. విస్తారంగా కురిసిన వర్షాలకు పచ్చగడ్డి పెరగడంతో పాటు పచ్చిక తినే పశువుల కడుపులోకి మట్టి కూడా చేరుతుంది. ఫలితంగా పశువుల కడుపుల్లో నత్తలు తయారవుతున్నాయని పశు పోషకులు వాపోతున్నారు. కలుషిత నీరు తాగడం వల్ల పశువులకు విరోచనాల వ్యాధి వస్తుంది. దీంతో పశువులు బక్కచిక్కిపోతాయి. వీటితో పాటు గొంతు వాపు, గాలికుంటు వ్యాధుల బారినపడే ప్రమాదం ఉంది. వ్యాధుల లక్షణాలను ముందే గుర్తించి, సరైన చికిత్స అందిస్తే పశువులను కాపాడుకునే అవకాశం ఉంటుంది.

జబ్బవాపు వ్యాధి..

ఆరోగ్యంగా ఉండే తెలుపురంగు జాతి దూడలకు సైతం ఈ వ్యాధి సోకే అవకాశాలుంటాయి. కలుషిత ఆహారం, నీటి ద్వారా ఈ వ్యాధి సోకుతుందని, భుజం, తొడ ప్రాంతంలో మాంసం కుళ్లిపోయి, వాపు వచ్చి ఆ వాపు దగ్గర కరకర శబ్దం వినిపిస్తుందని అంటున్నారు. దీనికి సకాలంలో చికిత్స అందకపోతే 12గంటల నుంచి 48 గంటల్లో ఈ వ్యాధి సోకిన దూడ మృత్యువాత పడే ప్రమాదం ఉంది. ముందస్తుగానే తొలకరిలో టీకాలు వేయించడం మేలు. వ్యాధి సోకిన పశువులకు యాంటీబయోటిక్స్ ఇంజెక్షన్లు మూడు నుంచి ఐదు రోజులు క్రమం తప్పకుండా వేయించాలి.

గొంతు వాపు వ్యాధి..

ఈ వ్యాధి సోకిన పశువులు ఎక్కువశాతం మృత్యువాత పడే అవకాశాలున్నాయి. వ్యాధి సోకిన పశువులకు అత్యధిక శరీర ఉష్ణోగ్రత వల్ల కంటి నుంచి నీరు కారడం, ఎర్రబడిపోవడం, నోటినుంచి చొంగ కారడం, గొంతు, మెడపై వాపు రావడం, శ్వాస కష్టంగా మారడం వంటివి జరుగుతాయి. సకాలంలో వైద్యం అందించకపోతే మృతి చెందే అవకాశాలున్నాయి. చలి గాలులు, అధిక వర్షాల్లో ఎక్కువ దూరం ప్రయాణం చేసినప్పుడు పశువులు ఒత్తిడికిలోనై ఈ వ్యాధి బారిన పడే అవకాశం ఉంది. దీనికి ముందస్తుగా తొలకరిలో టీకాలు వేయించాలి. ఒకవేళ వ్యాధి సోకితే పశువులకు యాంటిబయోటిక్స్, నొప్పి నివారణకు సూది మందులు, శ్వాస తీసుకోవడానికి స్టెరాయిడ్ ఇంజెక్షన్‌లు చేయించాలి.

గాలికుంటు వ్యాధి..

ఈ వ్యాధి సోకిన పశువుల శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 108 డిగ్రీల వరకు ఉంటుంది. నోటిలో నాలుకపై, పళ్ల చిగుళ్లపై నీటి కురుపులు ఏర్పడి చితికిపోవడంతో ఆ పశువులు మేత తినడం మానేస్తాయి. నోటి నుంచి నురగ కారుతుంది. నడవటానికి ఇబ్బంది పడతాయి. ఈ వ్యాధి సోకకముందే ముందస్తుగానే టీకాలు వేయించడం ఉత్తమ మార్గం. వ్యాధి సోకిన పశువుల్లో పాల దిగుబడి, పునరుత్పత్తి సామర్థ్యం బాగా తగ్గిపోతాయి. ఈ పశువులకు యాంటి బయోటిక్స్, విటమిన్ ఇంజెక్షన్లు, నొప్పి నివారణ సూది మందులు వేయించాలి.

అందుబాటులో టీకాలు..



పశువులకు అవసరమైన టీకాలు అందుబాటులో ఉన్నాయి. వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి. వ్యాధులు సోకిన పశువులను మంద నుంచి వేరు చేయాలి. వ్యాధు లను సకాలంలో గుర్తించి దగ్గరలో ఉన్న పశు వై ద్యులను సంప్రదించాలి. ఏ మాత్రం అను మానం వచ్చిన వెంటనే దగ్గరలోని పశు వైద్యశాలకు తీసుకువచ్చి వైద్యం చేయించాలి. అత్యవసర పరిస్థితుల్లో 1962 నంబరుకు కాల్ చేయొచ్చు.

–వి.హనుమంతరావు, పశు వైద్యాధికారి

హుండీ కానుకల లెక్కింపు

గుడివాడ టౌన్: స్థానిక శ్రీ గౌరీశంకరస్వామి దేవస్థానంలో గల స్వామి వారి ఆలయం, ఉప ఆలయాల హుండీ కానుకలను సోమవారం లెక్కించారు. ఈ లెక్కింపులో హుండీ ఆదాయం రూ.4 లక్షల 58 వేల 628 వచ్చినట్లు ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం తెలిపారు. ఆలయ తనిఖీ అధికారి వి.సుధాకర్ పర్యవేక్షణలో సోమవారం జరిగిన కానుకల హుండీల లెక్కింపులో శ్రీ శివాలయం ఆదాయం రూ.లక్ష 98 వేల 53, శ్రీ ఆంజనేయ స్వామి, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ఆదాయం రూ.69 వేల 782, శ్రీ సాయిబాబా మందిరం ఆదాయం రూ.లక్ష 90 వేల 793 మొత్తం రూ.4 లక్షల 58 వేల 628 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాతృశ్రీ భజన మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వృద్ధురాలి నేత్రదానం



తోట్లవల్లూరు: మండలంలోని యాకమూరు గ్రామానికి చెందిన అంగలకుదురు స్వర్ణ కుమారి (72) ఆదివారం మధ్యాహ్నం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కోరిక మేరకు నేత్రాలను దానం చేశారు. స్వర్ణకుమారి మృతి విషయాన్ని కుమార్తెలు కంచర్ల భవాని, కోడూరి ధనలక్ష్మి, కోడలు రమణ విజయవాడ ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి సమాచారం అందించటంతో డాక్టర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించారు. సుదర్శి మానవతా సంస్థ ద్వారా ఇది 181వ నేత్రదానమని సంస్థ ప్రతినిధి తలశిల రఘుశేఖర్ తెలిపారు. కుటుంబ సభ్యులను ఆయన, గ్రామస్తులు అభినందించారు.

క్రీడల ద్వారా విజ్ఞానం, నైపుణ్యం పెంపు

కలెక్టర్ పి.రాజాబాబు



గెలుపొందిన క్రీడాకారులతో కలెక్టర్ పి.రాజాబాబు చిత్రంలో ఎమ్మెల్యే పేర్ని నాని తదితరులు

చిలకలపూడి(మచిలీపట్నం):క్రీడల ద్వారా విద్యార్థుల్లో విజ్ఞానంతో పాటు నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ పి. రాజాబాబు తెలిపారు. ఏపీ స్టేట్ ఫస్ట్ ర్యాంక్ క్యారమ్ టోర్నమెంట్ ముగింపు సందర్భంగా విజేతలకు కప్‌లు, నగదు బహుమతుల ప్రదానం లక్ష్మీ టాకీసు సెంటరులోని ఓ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్యారమ్స్ క్రీడ ద్వారా ఎంతో నైపుణ్యం వస్తుందని తెలిపారు. విద్యార్థి దశ నుంచే ఈ క్రీడను అలవాటు చేసుకుంటే ఉన్నతస్థాయిలో ఆడేందుకు అవకాశాలు ఉంటాయని చెప్పారు. వీటి ద్వారా ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయన్నారు. బందరు శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య (నాని) మాట్లాడుతూ క్యారమ్స్ క్రీడ రానురానూ కనుమరుగవుతున్న నేపథ్యంలో రాష్ట్ర స్థాయి పోటీలు మచిలీపట్నంలో నిర్వహించటం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. గతంలో జీవో నెంబరు 74 ద్వారా 13 క్రీడలను తొలగించబడ్డాయని వీటిలో క్యారమ్ కూడా ఒకటి ఉందన్నారు. తాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి క్యారమ్‌క్రీడను రాష్ట్ర స్థాయి, దేశ స్థాయిలో కూడా నిర్వహించేలా చర్యలు తీసుకుంటానని వెల్లడించారు. క్యారమ్ క్రీడ ద్వారా నైపుణ్యం పొందిన క్రీడాకారులు స్పోర్ట్స్ కోటాలో ఉపాధి అవకాశాలు పొందలేకపోతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ ద్వారా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశాలు వచ్చేలా తాను సీఎం జగన్‌తో చర్చిస్తానని క్రీడాకారులకు హామీ ఇచ్చారు. అనంతరం క్యారమ్స్ పోటీల్లో విన్నర్‌గా నిలిచిన పి.జనార్దన్‌రెడ్డి (వైజాగ్)కి కప్‌తో పాటు రూ. 10 వేలు నగదు, రన్నర్ స్థానంలో నిలిచిన ఎండీ సాధిక్ (గుంటూరు)కు కప్‌తో పాటు రూ. 8వేలు నగదు, మూడో స్థానంలో నిలిచిన వైఎస్‌డీ రమేష్ (వైజాగ్)కు కప్‌తో పాటు రూ. 6 వేలు నగదు, నాల్గవ స్థానంలో నిలిచిన బి.రవీంద్రరెడ్డి(గుంటూరు)కు కప్, రూ. 4 వేలు నగదు అందజేశారు. ఏపీ స్టేట్ ఫస్ట్ ర్యాకింగ్ క్యారమ్ టోర్నమెంట్ స్టేట్ జనరల్ సెక్రటరీ అబ్దుల్ జలీల్, తహసీల్దార్ శ్రీవిద్య, జిల్లా అధ్యక్షుడు గుగ్గిళ్ల మురళీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, మాజీ డిప్యూటీ మేయర్లు లంకా సూరిబాబు, తంటిపూడి కవిత, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, టోర్నమెంట్ ఉపాధ్యక్షుడు గొర శ్రీహరి, ముచ్చర్ల వెంకటరత్నం పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నాం

- ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎంవీ నారాయణరెడ్డి
- అసత్య కథనాలకు ఖండన


మాట్లాడుతున్న ఎంవీ నారాయణరెడ్డి, పక్కన వెంకట లక్ష్మీకుమారి

గుడివాడ టౌన్: ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు ఆరోగ్యవంతమైన రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నామని ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎంవీ నారాయణరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. కొన్ని దినపత్రికలు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక తప్పుడు రాతలు రాస్తున్నారని అన్నారు. రూ.12 కోట్లతో నూతనంగా నిర్మించిన 100 పడకల ఆసుపత్రి భవనం ప్రారంభం నాటి నుంచీ ఆ పత్రిక ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ఏదో ఒక అసత్య వార్తలు వండి వార్చుతోందన్నారు. ఎమ్మెల్యే కొడాలి నాని చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరకుండా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. ఇటీవల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిలై 8 గంటల వరకు మరమ్మతు కుదరని పరిస్థితి ఏర్పడిందన్నారు. విజయవాడకు చెందిన నిపుణులు వచ్చిన అనంతరం ఇక్కడ సాంకేతిక సమస్య పరిష్కారమైందన్నారు. ఈ నేపథ్యంలో 6 గంటల వరకు జనరేటర్‌ల ద్వారా విద్యుత్ అందజేశామని, మరమ్మతు పనుల సమయంలో విద్యుత్ ఉండకూడదని, కొన్ని ప్రాంతాల్లో జనరేటర్ ద్వారా విద్యుత్ సరఫరాను నిలిపివేశామన్నారు. దీనిని బూతద్దంలో చూపుతూ వివరణ కోరకుండా పిచ్చి రాతలు రాశారన్నారు. రోగుల భోజనం విషయంలో కూడా తప్పుడు రాతలు రాశారని దీనిని పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. గతంలో ఒక్కొక్క పేషెంట్‌కు రూ.40 భోజనం ఖర్చులు ఇస్తుంటే ప్రస్తుత ప్రభుత్వం వాటిని రూ.70 వరకు పెంచిందన్నారు. ఈ విషయాన్ని ఆ పత్రిక ఏనాడూ ప్రచురించలేదన్నారు. గర్భిణులకు, బాలింతలకు రోజుకు రూ. 100 ఖర్చు చేస్తున్నామని ఏఒక్క పేషెంట్ కూడా ఆహార పదార్థాలు బాగోలేదని ఇప్పటికి ఒక్క ఫిర్యాదుచేయలేదన్నారు. ఇకపై ఈ విధమైన దుష్ప్రచారానికి పాల్పడితే న్యాయపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలు మాదాసు వెంకట లక్ష్మీకుమారి, తదితరులు పాల్గొన్నారు.

యువత భవితకు సీఎం పెద్ద పీట

- జాబ్ ఫెయిర్‌కు 530 మంది నిరుద్యోగులు హాజరు
- 146 మందికి వెంటనే కొలువులు



యువతికి నియామక పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు : నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉపాధి చూపిస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చెప్పారు. కైకలూరు విజ్ఞాన్ కాలేజీ ఆవరణలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, శిక్షణ ఉపాధి శాఖ, డీఆర్‌డీఏ, సీడాప్ ఆధ్వర్యంలో మెగా జాబ్ ఫెయిర్ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో రెండో దఫా జాబ్ మేళా నిర్వహించడం అభినందనీయమన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో లక్షలాది మంది నిరుద్యోగులు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించి కుటుంబానికి అండగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు మాట్లాడుతూ ముత్తూట్ ఫైనాన్స్, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, మోహన్ స్పింటెక్స్, హెట్రో డ్రగ్స్, నవత రోడ్ ట్రాన్స్‌పోర్ట్, సంగీత మొబైల్స్ వంటి 16 కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేశారన్నారు. నియోజకవర్గం నుంచి 530 మంది యువతీ యువకులు హాజరుకాగా వీరిలో 146 మందికి వెంటనే కొలువులు దక్కాయన్నారు. మరో 26 మందికి ఫైనల్ ఇంటర్వ్యూలు జరగాల్సి ఉందన్నారు. అనంతరం ఉద్యోగం సాధించిన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఎంపీపీలు అడవి కృష్ణ, చందన ఉమామహేశ్వరరావు, రామిశెట్టి సత్యనారాయణ, కలిదిండి జెడ్పీటీసీ బొర్రా సత్యవతి, ఎమ్మెల్యే డీఎన్నార్ కుమారుడు శ్యామ్ ఫణికుమార్, విజ్ఞాన్ విద్యా సంస్థల అధినేత రంగారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ కొండరాజు, నాయకులు దండే రవిప్రకాష్, రఫీ, జిల్లా ఉపాధి కార్యాలయ ప్రతినిధులు ప్రవీణ్, కిషోర్ రెడ్డి, వెలుగు సీసీ మైనంపూడి మాధవి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ప్రసాద్, జాబ్స్ రిసోర్స్ పర్సన్ మారగాని గణపతి, స్కిల్ డెవలప్‌మెంట్ సిబ్బంది హాజరయ్యారు.

రెండో పీహెచ్‌సీ భవన నిర్మాణానికి స్థల పరిశీలన



మండవల్లి : మండలంలోని పలు గ్రామాల్లో పీహెచ్‌సీ భవన నిర్మాణానికై స్థల సేకరణకు ఆర్డీఓ పి.కిషోర్ సోమవారం విచ్చేశారు. మండవల్లిలో గతంలో పీహెచ్‌సీ నిర్మించారు. అది ఎన్నో సంవత్సరాల నుంచి కొనసాగుతోంది. అయితే రోగులకు ఒక పీహెచ్‌సీ సరిపోకపోవడంతో రెండవ పీహెచ్‌సీ నిర్మాణానికై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మండలంలోని లోకుమూడి, చింతపాడు, కొవ్వాడలంక, తక్కెళ్లపాడు గ్రామాల్లో ఎక్కడ పీహెచ్‌సీ నిర్మాణం అనువుగా ఉంటుందని ఆర్డీఓతో పాటు అధికారులు పరిశీలించారు. తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, ఆర్ఐ పద్మరోజ, ఏఎస్ఐ రాజు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

తోట్లవల్లూరు: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని రైతు సాధికార సంస్థ అడ్వైజర్ డీవీ రాయుడు తెలిపారు. తోట్లవల్లూరులో ప్రకృతి వ్యవసాయంపై సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు పొందటానికి అవకాశం ఉంటుందని డీవీ రాయుడు తెలిపారు. పురుగు మందులు, ఎరువులు అధికంగా వినియోగించిన ఆహార ఉత్పత్తులతో అనారోగ్య సమస్యలు తలెత్తటంతోపాటు భూమి తన సహజస్థితిని కోల్పోతోందన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం కోసం, నాణ్యమైన దిగుబడుల కోసం ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. డీపీఎం పార్థసారథి, ఏ.డీపీఎం నాగమల్లీశ్వరి, వెలుగు ఏపీఎం కృష్ణంరాజు, రైతులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ముంపు పొలాల్లో నీటిని బయటకు తీయాలి


మాట్లాడుతున్న ఏడీఏ వెంకటమణి

మండవల్లి : ముంపు బారిన పడిన వరి పైర్లలో నీటిని బయటకు తీసిన వెంటనే బూస్టర్ డోస్‌గా ఎకరానికి 20 కిలోల యూరియా, 15 కిలోల మ్యురేట్ ఆఫ్ పొటాష్ పిచికారీ చేయాలని ఏడీఏ జి.వెంకటమణి సోమవారం పేర్కొన్నారు. మండలంలోని కానుకొల్లు, అల్లినగరం గ్రామాల్లో కలిసిన రైతులతో ఆమె మాట్లాడారు. జింకు ధాతు లోప నివారణకు ముడి జింకు లేదా చలామిన్ జింకును పిచికారీ చేయాలని సూచించారు. వరి పైరులో తెగులు ఉంటే ఒక గ్రాము కార్బెండిజమ్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. ముంపునకు గురైన వరికి ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు అందజేస్తుందని తెలిపారు. ఏఓ షేక్ జరీనా పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

ముదినేపల్లి రూరల్ : వర్షాలకు ముంపునకు గురైన పొలాల సంరక్షణ చర్యలు చేపట్టాలని మండవల్లి సబ్ డివిజన్ ఏడీఏ జి.వెంకటమణి అన్నారు. మండలంలోని సింగరాయపాలెం, శ్రీహరిపురం, వడాలి, అన్నవరం, పెదగొన్నూరు, వణుదుర్రు, వాడవల్లి గ్రామాల్లో ముంపు పొలాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెదలంక, పెదతుమ్మిడి, మల్లేశ్వరం, పెదకొమ్మిలేరు గ్రామాల్లో పొలాలు ముంపు బారిన పడ్డాయన్నారు. ముంపు తొలగిపోయే పొలాలకు సంరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. పొలాల నుంచి నీటిని తీసిన వెంటనే బూస్టర్‌డోస్‌గా ఎకరానికి 20 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ వేసుకోవాలన్నారు. జింక్‌ధాతులోప నివారణకు పొడిజింకు లీటరు నీటికి రెండు గ్రాముల వంతున ఎకరానికి 400 గ్రాములు పిచికారీ చేయాలన్నారు. వ్యవసాయాధికారి జరినా, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రం అందజేత



బాధితుడికి ఎల్‌వోసీ పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్


కైకలూరు : ముఖ్యమంత్రి సహాయ నిధికి సంబంధించి రూ.25 లక్షల మంజూరుకు ఎల్‌వోసీ పత్రాన్ని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కైకలూరులో బాధితునికి సోమవారం అందించారు. ముదినేపల్లి మండలం ములకలపల్లికి చెందిన కొసరాజు వెంకట నాగేశ్వరరావు కాలేయం దెబ్బతిని హైదరాబాద్ యశోదా హాస్పిటల్‌లో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే డీఎన్నార్‌ను సంప్రదించగా సీఎం సహాయనిధికి లిఖితపూర్వకంగా పంపారు. దీంతో ఎల్‌వోసీ రావడంతో బాధితుడు హాస్పటల్‌కు డబ్బు చెల్లించనున్నారు. ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, ములకలపల్లి సర్పంచ్ నువ్వుల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ముదినేపల్లి రూరల్ : వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని గురజ పీహెచ్‌సీ వైద్యాధికారి జనార్దన్ అన్నారు. సోమవారం మండలంలోని కాకరవాడ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో వర్షాకాలంలో ప్రబలే వ్యాధులపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, దోమలు లేకుండా చూడాలన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలి. అనారోగ్య సమస్యలు ఎదురైతే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


విద్యార్థినులతో న్యాయమూర్తి గాయత్రి


కైకలూరులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ కోర్టు జడ్జి షణ్ముఖరావు

గుడివాడ టౌన్: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి పి.గాయత్రి అన్నారు. స్థానిక కేటీఆర్ మహిళా కళాశాలలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల సంక్షేమానికి అనేక చట్టాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. వారి హక్కుల సాధనకు, తదితర అంశాలకు సంబంధించి అనేక చట్టాలు పొందుపర్చారన్నారు. వీటితో పాటు బాధ్యతలు కూడా గుర్తించాలన్నారు. చట్టాలపై అవగాహన ఉంటే కొన్ని అంశాలలో జాగ్రత్తలు వహిస్తారన్నారు. విద్యతో పాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఆమె కోరారు. న్యాయవాదులు ఎండీ రఫీ, సీహెచ్ కుటుంబరావు, విమలాదేవి, లక్ష్మీనారాయణ, లీగల్ వలంటీరు ఎస్ జోసఫ్, తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు : ప్రతి ఒక్కరూ చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని కైకలూరు సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జి.షణ్ముఖరావు చెప్పారు. సాధారణ తనిఖీలలో భాగంగా కైకలూరు సబ్‌జైలును ఆయన సోమవారం పరిశీలించారు. న్యాయ సహాయ కేంద్రం ఆధ్వర్యంలో పలు చట్టాలను వివరించారు. ఖైదీలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. భోజనం, నిద్రించే గదులు ఎలా ఉన్నాయని అడిగారు. ఒక్కో ఖైదీ కేసు వివరాలు తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ పరివర్తన చెంది బయటకు వచ్చిన తర్వాత కుటుంబ సభ్యులతో జీవనం సాగించాలన్నారు. బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బందెల లక్ష్మణరావు, న్యాయవాదులు ఎంఎస్ఎస్.రాజు, డి.శివప్రసాద్, అడ్డగర్ల రాంబాబు, జైలు సూపరింటెండెంట్ బొత్స అప్పారావు పాల్గొన్నారు.

ఎస్ఐ వెంకటకుమార్ బాధ్యతల స్వీకరణ



ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి ఎస్ఐగా దేశంశెట్టి వెంకటకుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలు కాపాడేందుకు కృషి చేస్తానన్నారు. కోడిపందేలు, పేకాట వంటి జూదాలను పూర్తిస్థాయిలో అరికడతామని చెప్పారు. పార్టీలకతీతంగా స్టేషనుకు వచ్చే ప్రతి ఒక్కరికి తగిన న్యాయం చేస్తానని పేర్కొన్నారు. మండలంలోని ప్రజలు శాంతిభద్రతలు కాపాడేందుకు సహకారించాలని కోరారు.

మణిపూర్ దాడులకు నిరసనగా శాంతి ర్యాలీ


నిరసన వ్యక్తం చేస్తున్న పాస్టర్లు

ముదినేపల్లి రూరల్ : మణిపూర్‌లో క్రైస్తవ దాడులకు వ్యతిరేకంగా ముదినేపల్లి మండల పాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో ముదినేపల్లిలో సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కె.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నేతలు కొర్నేలి ఏసురత్నం, విజయకుమార్, కె.ప్రభుదాస్, యోహాన్ మాట్లాడుతూ మణిపూర్‌లో క్రైస్తవులు, చర్చిలపై సంఘ వ్యతిరేక శక్తులు దాడులు చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నిమ్మగడ్డ భిక్షాలు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సేవా నాగబాబు, జగన్‌రావు, పాస్టర్లు దివాకర్, ప్రసన్నరాజు, పీటర్, స్పర్జన్‌రాజు, డేవిడ్‌రాజు పాల్గొన్నారు.